APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక

23-06-2026
మంగళవారం
హైదరాబాద్
సంపుటి: 17 I సంచిక: 239
పేజీలు: 04 I వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:
https://epaper.expresstelugudaily.com



2

## మమతా బెనర్జీకి బిగ్ షాక్



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో..

# రేవంత్, కిషన్‌రెడ్డి భేటీ

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 అనుమతులపై చర్చ

ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలపైనా..

నేతలు సమీక్షించినట్లు సమాచారం

- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- అన్ని వసతులతో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయండి
- వాయుసేన టెర్మినల్‌తోపాటు కార్గో, హ్యాంగర్, ఎమ్ఆర్‌వో సౌకర్యాలు కల్పించాలి
- దేవరకద్రలో డీఆర్‌డీవో ప్రాజెక్టు మంజూరు చేయండి..
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ రెడ్డి వినతి
- గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు భూములు బదలాయించినందుకు కృతజ్ఞతలు తెలిపిన సీఎం



2

## శిండే క్యాంప్‌లోకి ఆరుగురు ఎంపీలు

- ఆపరేషన్ టైగర్ విజయవంతమైంది
- మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే



2

బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్
## రాజీనామా

- లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది
- పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేశానన్న స్టార్మర్



2



2

## ప్రజల భద్రతే ప్రాధాన్యం

- ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలి
- జూన్ నుంచి అక్టోబర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి
- పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

## ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా భువనగిరి కోట

- రూ.56.81 కోట్ల వ్యయంతో కోటను అభివృద్ధి చేస్తున్నాం
- రోప్‌వే ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది
- ఫణిగిరి బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి రూ.5 కోట్లు..
- కొలనుపాక సోమేశ్వరాలయం స్మార్ట్ టెంపుల్‌గా అభివృద్ధి..
- పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



2

## కోచింగ్ సెంటర్‌లో ఘోర అగ్నిప్రమాదం

- 15మంది మృతి.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- తమ ప్రాణాలను కాపాడుకొనేందుకు భవనం పైఅంతస్తుల నుంచి కిందికి దూకిన పలువురు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ
- సమగ్ర దర్యాప్తునకు ఆదేశించిన సీఎం యోగి



2

విలేకరులు కావలెను
స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com



Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# కోచింగ్ సెంటర్‌లో ఘోర అగ్నిప్రమాదం



**నేషనల్ బ్యూరో :** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని ఓ కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 15కు చేరింది. మరికొందరు గాయాలతో చికిత్సపొందుతున్నారు. ఈ ఘటనలో కొందరు తమ ప్రాణాలను కాపాడుకోవేందుకు భవనం పైఅంతస్తుల నుంచి కిందికి దూకారు. ఈ ప్రమాద దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. లక్నోలోని అలీగంజ్ ప్రాంతంలోని మూడంతస్తుల భవనం పైభాగంలో తొలుత మంటలు చెలరేగాయి. తర్వాత పైఅంతస్తుల్లో ఉన్న కోచింగ్ సెంటర్‌కు వ్యాపించాయి. భవనమంతా మంటల్లో చిక్కుకుపోవడంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు అలుముకున్నాయి. మృతుల్లో పలువురు విద్యార్థులతో పాటు మరికొందరు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మంటల్లో చిక్కుకున్న పలువురు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి పైనుంచి దూకిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఒక వ్యక్తి పగిలిన కిటికీ నుంచి బయటకు వచ్చే క్రమంలో కిందికి పడిపోయాడు. అది గమనించి స్థానికులు వెంటనే అతడిని కాపాడారు. గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు. కొందరు అక్కడి తీగలను పట్టుకొని వేలాడుతూ బయటపడే ప్రయత్నం చేశారు. అగ్నిప్రమాదం జరిగిన 30 నిమిషాల తర్వాత ఫైర్ ఇంజిన్లు వచ్చాయని స్థానికులు ఆరోపించారు. అందువల్లే, మంటలు మరింత భారీగా వ్యాపించాయని చెబుతున్నారు.

'లక్నోలో అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున నష్టపరిహారం అందిస్తాం'

\- ప్రధాని నరేంద్ర మోదీ

'లక్నో ప్రమాదం దిగ్భ్రాంతికి గురి చేసింది. ఘటనా స్థలాన్ని వెంటనే సందర్శించి.. నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించా. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు వీలుగా అధికారులతో పర్యవేక్షణ కుదించుకుని వెంటనే లక్నోకు బయలుదేరుతున్నాను'

\- యూపీ సీఎం యోగి

'లక్నో ప్రమాద ఘటన కలచివేసింది. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా. వీలైనంత త్వరగా మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా'

\- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

'లక్నో ప్రమాదంలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా'

\- రాహుల్ గాంధీ

# రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో రేవంత్, కిషన్‌రెడ్డి భేటీ



**ఢిల్లీ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన రైల్వేమంత్రితో రైల్ భవన్‌లో సమావేశం అయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 అనుమతుల అంశంపై ఆయనతో చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖను రాసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరంలో మెట్రో రైలుకు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేవిధంగా చూడాలని లేఖలో కోరిన విషయం తెలిసిందే. రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే ముగ్గురు సమావేశం అవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ :**
భారత వాయు సేన (IAF) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న ఎయిర్‌పోర్ట్ దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున, దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకరిస్తామని రక్షణశాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైనందున ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# శిండే క్యాంప్‌లోకి ఆరుగురు ఎంపీలు

**ముంబయి :** మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. శివసేన (యూబీటీ)కు చెందిన ఆరుగురు ఎంపీలు శిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. దీంతో గడిచిన కొన్ని రోజులుగా శివసేన (యూబీటీ)లో చీలికపై జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. 'ఆరు పులులు (ఎంపీలనుద్దేశించి) ఇప్పుడు అసలైన శివసేన ఫ్యామిలీలోకి వచ్చాయి. వారికి స్వాగతం. ఆపరేషన్ టైగర్ విజయవంతమైంది' అని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే ప్రకటించారు. శిండే క్యాంప్‌లో చేరిన ఎంపీల్లో ఓం రాజే నింబాల్కర్, సంజయ్ దిన పాటిల్, సంజయ్ జాదవ్, సంజయ్ దేశ్‌ముఖ్, నగేష్ పాటిల్ అష్టికర్, బౌసాహెబ్ వక్చౌరే ఉన్నారు. మొత్తం 9 మంది ఎంపీల్లో ఆరుగురు శిండే క్యాంప్‌లో చేరడంతో పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల క్రితం 2022 జూన్ 22న 40 మంది ఎమ్మెల్యేలు తమతో వచ్చారన్న శిండే.. ఇప్పుడు ఏకంగా 'సిక్స్' కొట్టామని పేర్కొన్నారు. శివసేన రెండో విడత విస్తరణ ప్రణాళికగా ఈ చేరికను అభివర్ణించారు. మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఇటీవల ఢిల్లీలో పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేయగా.. కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో శివసేనలో మరోసారి చీలిక ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలోనే కొన్ని రోజులుగా అధికార, విపక్ష కూటముల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ తాజాగా ఆరుగురు ఎంపీలు శిండే క్యాంప్‌లో ప్రత్యక్షమయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అందడం లేదన్న కారణంతోనే తాము పార్టీ మారుతున్నట్లు రెబల్ ఎంపీలు చెప్పుకొచ్చారు.

# బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

**నేషనల్ బ్యూరో :** బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత నెలకొంది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. తాజా పరిణామంతో బ్రిటన్‌లో దశాబ్ద కాలంలో తమ పదవులకు రాజీనామా చేసిన ప్రధానుల సంఖ్య ఆరుకి చేరింది. కీర్ స్టార్మర్ 2024లో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ అంతగా ప్రభావం చూపలేకపోవడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

# ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు

**పెగడపల్లి :** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని నేరుగా ప్రజల వద్దకే చేరవేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం సహాయ నిధి, కళ్యాణ లక్ష్మి చెక్కులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధర్మపురి నియోజకవర్గ ప్రజలు సీఎం సహాయ నిధి, కళ్యాణ లక్ష్మి చెక్కుల కోసం కరీంనగర్ వరకు వెళ్లాల్సి వచ్చేదని, అయితే ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రజల వద్దకే నేరుగా సంక్షేమ పథకాలను అందజేస్తోందని తెలిపారు. ప్రతి పేదవాడి కల అయిన సొంతింటి నిర్మాణాన్ని నెరవేర్చడం తన బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగా మొదటి విడతలో మండలానికి 499 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. రెండో విడతలో జూలై నాటికి అర్హులైన మరింత మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నామని మంత్రి తెలిపారు.

# పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రం సహకారం అవసరం

**ఢిల్లీ :** తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి కేంద్రం సహకారం అందించాలి" అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తో భేటీ అయ్యి రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' లక్ష్య సాధనలో భాగంగా ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నామని, కేంద్రం అండగా నిలవాలని కోరారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో ప్రతిపాదిత గ్లోబల్ ఇన్నోవేషన్, ఆర్ అండ్ డీ సెంటర్‌కు అనుసంధానంగా లాజిస్టిక్ హబ్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భవ్య స్కీం ఫేజ్-1లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇచ్చి ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్కులకు అనుమతులు ఇవ్వాలని కోరారు.రాష్ట్రానికి ఏరో-డిఫెన్స్ కారిడార్ మంజూరు చేయడం, హైదరాబాద్‌లో నేషనల్ డిజైన్ సెంటర్ ఏర్పాటు, ఎంఎల్ఎఫ్ఏసీడీ కింద రెండు మెగా లెదర్ పార్కుల కేటాయింపు వంటి అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మనోహరాబాద్‌లో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్‌కు అనుమతి, కోహెడలో ఇర్రేడియేషన్ సదుపాయానికి నిధులు, పామ్ ఆయిల్ దిగుమతి సుంకం పునరుద్ధరణ, రామగుండం ఎరువుల కర్మాగారం యూరియా రాష్ట్రానికి కేటాయింపు అంశాలపై విజ్ఞప్తి చేశారు.

# క్యాన్సర్ బాధితులకు బసవతారకం ఆసుపత్రి ఓ భరోసా




**హైదరాబాద్ :** క్యాన్సర్ బాధితులకు బసవతారకం ఆసుపత్రి ఓ భరోసా అని కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్ అన్నారు. ఇక్కడ చాలా తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్నారని చెప్పారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. "దేశంలో ఏటా 15లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీన్ని తొలి దశలో గుర్తించడం చాలా కష్టం. 30ఏళ్లు దాటిన వారికి ఆయుష్మాన్ భారత్ కింద ఉచితంగా దీనికి సంబంధించిన పరీక్షలు చేస్తున్నాం. దేశంలో 6 కోట్ల మంది మహిళలు బ్రెస్ట్, 9 కోట్ల మంది సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సర్వైకల్ క్యాన్సర్ రాకుండా మహిళలు, బాలికల కోసం మోదీ ప్రభుత్వం హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకొచ్చింది. 14 ఏళ్లలోపు ఉన్న 1.20 కోట్ల మంది బాలికలకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నాం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దీన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఒకప్పుడు 8 మాత్రమే ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రులు.. ఇప్పుడు 23కు చేరాయి" అని అనుప్రియ వివరించారు.

**తల్లి ఆశయాలను నిలిపిన అరుదైన కుమారుడు బాలకృష్ణ: పెమ్మసాని**

క్యాన్సర్ అంటే గుర్తొచ్చేది బసవతారకం ఆసుపత్రి అని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. "100 పడకలతో ప్రారంభమైన ఈ ఆసుపత్రి నేడు 650 పడకల ఆస్పత్రిగా ఎదిగింది. పేదలకు ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ కింద సేవలు అందిస్తున్నారు. కార్పొరేట్‌తో పోలిస్తే దాదాపు 40 శాతం తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందుతున్నాయి. ఆస్తులకు వారసులు ఎందరో ఉంటారు కానీ.. ఆశయాలకు వారసులు కొందరే. తల్లి ఆశయాలను నిలిపిన అరుదైన కుమారుడు బాలకృష్ణ. ఇది ప్రేమకు నిదర్శనమైన పవిత్ర క్షేత్రం. ఎన్టీఆర్ ప్రేమ సాక్షిగా బసవతారకం ఆసుపత్రి చరిత్రలో నిలిచిపోతుంది" అని పెమ్మసాని అన్నారు.

**తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలు: దామోదర రాజనర్సింహ**

తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రోగులకు నాణ్యమైన వైద్యసేవలను తక్కువ ఖర్చుతో బసవతారకం ఆసుపత్రి అందిస్తోందని చెప్పారు. "తెలంగాణలో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడంపై ప్రజలకు అవగాహన పెంచాల్సి ఉంది. రాష్ట్రంలో క్యాన్సర్ రిజిస్ట్రీ మెయింటెన్ చేస్తున్నాం. దీనిని నోటిఫైడ్ వ్యాధిగా గుర్తించాం. ఆరోగ్య ఖర్చులు ప్రజలకు భారం కాకూడదు. క్యాన్సర్ చికిత్సలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి" అని చెప్పారు.

# ప్రజల భద్రతే ప్రాధాన్యం

**తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో వర్షాకాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడంతో పాటు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాలకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు సమీక్ష నిర్వహించి ఆర్ అండ్ బి శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను విడుదల చేసినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది వరకే తాను సమీక్షించిన అంశాల మేరకు ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి సూచించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను.. ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, డీవాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, హెచ్‌డీపీఈ పైపులు తదితర అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ప్రమాదకర ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ, తెలంగాణ డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ సేఫ్టీ పోర్టల్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని... పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని, వరద నీరు తగ్గిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, జీపీఎస్ వివరాలతో నష్టం అంచనా నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఇంజినీర్లకు అప్పగించిన అధికారాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వరదల కారణంగా చేపట్టే పునరుద్ధరణ పనుల వ్యయాన్ని ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఎంఎఫ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. వర్షపాతం తీవ్రతను బట్టి రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్,ఎల్లో,ఆరెంజ్, రెడ్ కలర్‌కోడ్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థను అమలు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

**204 మీ.మీ వర్షం నమోదైతే రెడ్ అలెర్ట్..**

24 గంటల్లో 64.5 మి.మీ కంటే తక్కువ వర్షపాతం నమోదైతే గ్రీన్ అలర్ట్ కింద సాధారణ పర్యవేక్షణ కొనసాగిస్తూ యంత్రాలు, సామగ్రి సిద్ధంగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని మంత్రి సూచించారు. 64.5 నుంచి 115 మి.మీ మధ్య వర్షపాతం నమోదయ్యే ఎల్లో అలర్ట్ పరిస్థితుల్లో సున్నితమైన ప్రాంతాలను సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు (ఏఈఈలు) ప్రత్యక్షంగా సందర్శించి, కాంట్రాక్టర్లు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. 115 నుంచి 204 మి.మీ మధ్య వర్షపాతం నమోదయ్యే ఆరెంజ్ అలర్ట్ సమయంలో ఏఈఈలు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండగా... ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈఈలు) ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. 204 మి.మీ.కు పైగా వర్షపాతం నమోదయ్యే రెడ్ అలర్ట్ పరిస్థితుల్లో ఏఈలు, ఏఈఈలు, ఈఈలు 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహాయక చర్యలను సమన్వయం చేయాలని, పరిస్థితులపై వెంటనే ఎస్‌ఈ, ఆపై సీఈలకు సమాచారం అందించాలని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెంటర్‌కు ఈ వర్షాకాలంలో రోజువారీ పరిస్థితుల నివేదికలు తప్పనిసరిగా సమర్పించాలని, నష్టం జరగకపోయినా నిల్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారి రవాణా వ్యవస్థను కొనసాగించడం, వరదల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ఈ ఎస్‌ఓపీ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు.

# మమతా బెనర్జీకి బిగ్ షాక్

**నేషనల్ బ్యూరో :** బెంగాల్ రాజకీయాల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత విభేదాలు కొత్త మలుపు తిరిగాయి. పార్టీ వ్యవస్థాపకురాలు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వానికి సవాల్ విసురుతూ రెబల్ వర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రతిపక్ష నేత రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను పార్టీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించింది. దీంతో దీదీకి పెద్ద షాక్ తగిలినట్లయింది.టీఎంసీలో అసెంబ్లీ నుంచి ప్రారంభమైన విభేదాలు తరువాత పార్లమెంట్ వరకు విస్తరించగా, ఇప్పుడు పార్టీ సంస్థాగత నిర్మాణానికే చేరుకున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కోల్‌కతాలో జరిగిన ఈ ప్రత్యేక సమావేశానికి రెబల్ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు, ఇతర నేతలు హాజరయ్యారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన రితబ్రత బెనర్జీ, పార్టీ రాజ్యాంగం ప్రకారం అన్ని నిబంధనలను పాటిస్తూ ఈ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమావేశంలో అరూప్ రాయ్‌ను టీఎంసీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వెల్లడించారు. పార్టీ కొత్త నాయకత్వ బృందాన్ని కూడా ప్రకటించారు. మాజీ మంత్రి అరూప్ బిశ్వాస్‌తో పాటు ఎమ్మెల్యేలు ఫిర్హాద్ హకీమ్, రథిన్ ఘోష్, సబీనా యాస్మిన్‌లను ఉపాధ్యక్షులుగా నియమించారు. రితబ్రత బెనర్జీ, జావెద్ ఖాన్, సందీపన్ సాహాలను ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. రఘునాథ్‌గంజ్ ఎమ్మెల్యే అఖ్రుజ్జమాన్ అన్సారీకి పార్టీ ఖజానాదారు బాధ్యతలు అప్పగించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను ఎన్నికల సంఘానికి తెలియజేస్తామని రితబ్రత బెనర్జీ స్పష్టం చేశారు. పార్టీ అసలైనదా కాదా అన్నది తాము నిర్ణయించేది కాదని, ఎన్నికల సంఘమే దానిపై తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పార్టీ రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక సమావేశం నిర్వహించామని, అందుకు సంబంధించిన అన్ని వివరాలను ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు తెలిపారు.కొత్త నాయకత్వం ఏర్పడిన నేపథ్యంలో త్వరలోనే పార్టీ సంస్థాగత వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తామని రితబ్రత వెల్లడించారు. జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీతో పాటు అధికార ప్రతినిధుల బృందాన్ని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. దీంతో టీఎంసీలో రెండు వర్గాల మధ్య అధికార పోరు మరింత ఉధృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మమతా బెనర్జీపై వ్యక్తిగతంగా తాము ఎలాంటి వ్యతిరేకత కలిగి లేమని రితబ్రత బెనర్జీ పేర్కొన్నారు. మమతా బెనర్జీ కోరుకుంటే తమ వర్గంలో ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించవచ్చని వ్యాఖ్యానించారు. ఆమెకు తమ వద్ద గౌరవప్రదమైన స్థానం ఉంటుందని తెలిపారు.ఇటీవల జరిగిన బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఎదుర్కొన్న ఓటమి తర్వాత పార్టీ అంతర్గతంగా అసంతృప్తి పెరిగినట్లు తెలుస్తోంది. అదే అసంతృప్తి ఇప్పుడు బహిరంగ తిరుగుబాటుగా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం టీఎంసీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేలలో 58 మంది రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా సమర్థించినట్లు ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసిన అభ్యర్థిని తిరస్కరించడం ద్వారా అప్పుడే పెద్ద సంక్షోభం ప్రారంభమైంది. ఆ తర్వాత తమకు మద్దతు మరింత పెరిగిందని రెబల్ వర్గం చెబుతోంది.అసెంబ్లీకే పరిమితమైన ఈ సంక్షోభం పార్లమెంట్‌కు కూడా విస్తరించింది. టీఎంసీకి చెందిన 28 మంది లోక్‌సభ సభ్యుల్లో 20 మంది ఇటీవల పార్టీ పార్లమెంటరీ విభాగం నుంచి వైదొలిగినట్లు సమాచారం. వారు నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో విలీనమై, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి మద్దతు ప్రకటించినట్లు వెల్లడైంది. ఈ పరిణామాలు బంగాల్ రాజకీయాల్లో సంచలనంగా మారాయి. ఒకప్పుడు మమతా బెనర్జీ చుట్టూ ఏకతాటిపై ఉన్న టీఎంసీ ఇప్పుడు తీవ్ర అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రెబల్ వర్గం చేపడుతున్న చర్యలు ఎంతవరకు ఫలిస్తాయి? ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? మమతా బెనర్జీ తదుపరి వ్యూహం ఏమిటి? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

# ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా భువనగిరి కోట

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** "భువనగిరి కోటను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం" అని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.భువనగిరి కోట పర్యాటక అభివృద్ధి పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోట క్రింద రోప్‌వే, హోటల్ నిర్మాణం, పార్కింగ్, రెస్ట్‌రూమ్స్, చిల్డ్రన్ ప్లే ఏరియా, రాక్ గార్డెన్ అభివృద్ధి, అలాగే కొండపై కోట పునరుద్ధరణ, కేఫేటెరియా, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, మెట్ల పునరుద్ధరణ, ఎంట్రన్స్ ప్లాజా వంటి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.పనుల్లో జాప్యం చోటుచేసుకున్నదని అసహనం వ్యక్తం చేస్తూ, అక్టోబర్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పగలు, రాత్రి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.56.81 కోట్ల వ్యయంతో కోటను అభివృద్ధి చేస్తున్నామని, రోప్‌వే ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. యాదాద్రి-భువనగిరి-కొలనుపాకలను కలిపి ఆధ్యాత్మిక-వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీ గౌతమి మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ జయంతి కలెక్టర్ డాక్టర్ అర్జున రావు డైరెక్టర్ పాల్గొన్నారు.

**ఫణిగిరి బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి రూ.5 కోట్లు..**

"బౌద్ధ వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది" అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా ఫణిగిరి, గాజులబండ బౌద్ధ క్షేత్రాల్లో పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. సీఎస్ఆర్ నిధులతో ఫణిగిరి కట్టడాల సంరక్షణకు రూ.1.60 కోట్లు, గాజులబండకు రూ.23 లక్షలు వెచ్చించనున్నారు.ఫణిగిరి సమగ్రాభివృద్ధికి అదనంగా రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో అప్రోచ్ రోడ్డు, మెట్లదారి, పర్యాటక సదుపాయాల అభివృద్ధి చేపట్టనున్నారు.బౌద్ధ పర్యాటక పటంలో తెలంగాణకు గుర్తింపు పెంచే దిశగా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో: మందుల సామేలు ఎమ్మెల్యే తేజస్ నందలాల్ పవార్ కలెక్టర్ నరసింహ ఎస్పీ డాక్టర్ అర్జున రావు డైరెక్టర్ పాల్గొన్నారు.

**కొలనుపాక సోమేశ్వరాలయం స్మార్ట్ టెంపుల్‌గా అభివృద్ధి..**

"కొలనుపాక సోమేశ్వరాలయాన్ని స్మార్ట్ టెంపుల్‌గా తీర్చిదిద్దుతాం" అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆలేరు మండలం కొలనుపాకలో శ్రీ సోమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, పరిశుభ్రత, డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యమని తెలిపారు. ఆలయాన్ని ఆధ్యాత్మిక, వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో: బీర్ల ఐలయ్య విప్ భాస్కర్‌రావు అదనపు కలెక్టర్ డాక్టర్ అర్జున రావు డైరెక్టర్ పాల్గొన్నారు.

# మోమిన్ పేట్ మేకల బజారును తరలించవద్దు

**తహసీల్దార్‌కు వ్యాపారులు, రైతుల వినతి**



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్ పేట్ మండల కేంద్రంలో సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వారాంతపు మేకల బజారును ఇతర ప్రాంతానికి తరలించవద్దని వ్యాపారులు, రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ బజారు ద్వారా మండలంతో పాటు పరిసర గ్రామాల రైతులు, పశుపోషకులు, వ్యాపారులు తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారని వారు పేర్కొన్నారు.మేకల బజారు కేవలం కొనుగోలు, అమ్మకాలకే పరిమితం కాకుండా వందలాది కుటుంబాలకు ఆదాయ వనరుగా నిలుస్తోందని తెలిపారు. బజారును తరలిస్తే రైతులు,వ్యాపారులు, చిన్నచిన్న దుకాణదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుత స్థలంలోనే బజారును కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ లేదా ఇతర సమస్యలు ఉన్నట్లయితే వాటి పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మేకల బజారును యథావిధిగా కొనసాగించాలని తహసీల్దార్‌ను కోరారు.ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు, రైతులు మాట్లాడుతూ.. బజారు తరలింపు నిర్ణయాన్ని పునఃపరిశీలించి, తమ జీవనాధారాన్ని కాపాడాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

# ఎస్.ఐ.ఆర్ పై అవగాహన సదస్సులో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్





**పటాన్ చెరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై ఓటర్లకు సంపూర్ణ అవగాహన కల్పించే ఉద్దేశంతో ఆల్ పార్టీ మీటింగ్ పటాన్చెరులోని పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులో ఎం.డి.ఆర్ ఫౌండేషన్ కోఫౌండర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు బి.ఎల్.ఒ లకు బూత్ లెవెల్ ఏజెంట్లు బి.ఎల్.ఎ లకు ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం అమలు విధానం, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ..ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. జూన్ 25 నుండి జూలై 25 వరకు జరిగే ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులను లేదా బూత్ లెవెల్ ఏజెంట్లను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్,మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్,వంగరి అశోక్,పటాన్ చెరు తహశీల్దార్ హరిబాబు,డిప్యూటీ తహశీల్దార్ షఫీ, బూత్ లెవెల్ ఆఫీసర్లు,బూత్ లెవెల్ ఏజెంట్లు, ప్రజాప్రతినిధులు మరియు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో స్థానికులకి ప్రథమ ప్రాధాన్యత కల్పించండి

- అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వాములు కావాలి
- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని సుల్తాన్పూర్ మెడికల్ డివైస్ పార్కులో గల పరిశ్రమలు స్థానికులకు ఉద్యోగాల కల్పనలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పరిశ్రమల యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సుల్తాన్పూర్ మెడికల్ డివైస్ పార్కు లో గల ఐలా కార్యాలయంలో ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, ఐలా అధికారులతో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రస్తుతం 120 పరిశ్రమలు ఉత్పత్తులు కొనసాగిస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రతి పరిశ్రమ ఉద్యోగాల కల్పనలో స్థానికులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రిక్రూట్మెంట్ సమయంలో వివిధ మాధ్యమాల ద్వారా స్థానికులకు సమాచారం అందించాలని కోరారు. దీంతో పాటు ప్రజోపయోగ కార్యక్రమాలకు సిఎస్ఆర్ నిధులు కేటాయించాలన్నారు.జులై మొదటి వారంలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ దేవానందం,మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి,ఐలా కమిషనర్ శ్రీనివాస్,డిఈ సురేందర్, విద్యుత్ శాఖ ఏడి సంజయ్, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



# అర్హుల పేర్లు పోకుండా జాగ్రత్త పడాలి





**- ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి**

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరి పేరు గల్లంతు కాకుండా జాగ్రత్త పడాలని,ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు ఈ ప్రక్రియపై ప్రత్యేక అవగాహన,శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌ఛార్జ్ సచిన్ సావంత్, పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ శేట్కార్,డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి,వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని గార్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు విశేషంగా కృషి చేయాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఉద్దేశాన్ని, ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, ఈ విధానాలపై ఉన్న అపోహలను పూర్తిగా తొలగించాలన్నారు.అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదయ్యేలా ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టడంతో పాటు, అర్హుల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగింపునకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని వారు స్పష్టం చేశారు.

ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి,జహీరాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ చంద్రశేఖర్, రాష్ట్ర సీనియర్ నాయకులు డా.సిద్దం ఉజ్వల్ రెడ్డి, మాజీ టీజీఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్,ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ మహ్మద్ గౌస్,ఆత్మ కమిటీ చైర్మన్ రాంలింగా రెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్,జహీరాబాద్ మరియు కోహీర్ మున్సిపల్ చైర్మన్లు యూనూస్,అశోక్, లు పాల్గొన్నారు. వీరితో పాటు జహీరాబాద్ నియోజకవర్గ మండల కాంగ్రెస్ మరియు టౌన్ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి,భాస్కర్ రెడ్డి, నరేష్ గౌడ్, మల్లన్న పాటిల్,ఉదయ్ శంకర్ పాటిల్,ముజఫర్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి,సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, హన్మంతరావు పాటిల్,కండెం నర్సింహులు, శ్రీకాంత్ రెడ్డి,ఖాజామియా, కుతుబోద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి,జాఫర్, అరుణ్ కుమార్,జమిలాలోద్దీన్, జహీంగిర్,అక్రం,నిజాం, జావిద్, అతిక్,మహేష్,సర్పంచ్ లు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సందు గూడెం మక్తకుంటను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెల్లాపూర్ డివిజన్ సందుగూడెం పరిధిలో గల మక్త కుంట చెరువును ఆక్రమించేందుకు ఇటీవల కొందరు ప్రయత్నిస్తున్నారని,గజం భూమిని కబ్జా చేసిన క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం నీటిపారుదల శాఖ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు,గ్రామస్తులతో కలిసి ఆయన చెరువును సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..సందు గూడెం పరిధిలో గల మక్తకుంట చెరువులో ఇటీవల కొందరు వ్యక్తులు తమ శిఖం భూమి పేరుతో మట్టిని నింపుతూ చెరువును కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు తన ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.ఈ నేపథ్యంలోనే తానే స్వయంగా క్షేత్రస్థాయి పర్యటనకు రావడం జరిగిందని తెలిపారు. గ్రామానికి అనుసంధానంగా గల చెరువు కట్ట రహదారిని సైతం ధ్వంసం చేయడం అత్యంత దారుణమని అన్నారు.దశాబ్దాలుగా ఇదే రహదారిని ఉపయోగిస్తూ అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు. చెరువు శిఖం పట్టాలో వ్యవసాయం



చేయాలే తప్ప మట్టిని నింపుతూ చెరువు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రెండు రోజుల్లోగా చెరువు కట్టను పునరుద్ధరించడంతోపాటు చెరువును ఆక్రమిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నీటి పారుదల శాఖ ఈఈ భీమ్ ఆదేశించారు. గజం భూమిని కబ్జా చేసిన వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్,నీటిపారుదుల శాఖ ఈఈ భీమ్,ఏఈ జ్యోతి,మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి,కొమరయ్య,సీనియర్ నాయకులు రమేష్,రాజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ సంతోష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించిన జర్నలిస్టులు

**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** 22 నెలల పాటు నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహించి, ఖమ్మం పట్టణానికి బదిలీపై వెళుతున్న ఎస్సై పి. సంతోష్‌ను సోమవారం స్థానిక జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ..ఎస్ఐ పి.సంతోష్ ప్రజల పట్ల స్నేహపూర్వక వైఖరితో పాటు విధి నిర్వహణలో అంకితభావాన్ని చేస్తున్నారని ప్రదర్శించారని కొనియాడారు. ఎన్ని ఒత్తిడులు, సవాళ్లు ఎదురైనా నిబద్ధతతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. ముఖ్యంగా తలసేమియా బాధితులకోసం నిర్వహించిన బ్లడ్ క్యాంపులు బాధితులు జీవితాల్లో వెలుగులు నింపాయని కొనియాడారు. యువతను పట్టి పీడిస్తున్న గంజాయిని నిర్మూలన చేయుటకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఎస్ఐ కే దక్కిందని అన్నారు. నేలకొండపల్లి ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన ఆయన




సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత హోదాల్లో పనిచేసి మరింత పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు.ఎస్ఐ పి.సంతోష్ కూడా జర్నలిస్టులు అందించిన గౌరవానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా, ప్రజా వేదిక ఎడిటర్ గంజికుంట్ల వెంకన్న, ఈనాడు పత్రిక రిపోర్టర్ మైసా శ్రీను, పాలేరు వి6 రిపోర్టర్ దాన కర్ణ,అక్షిత రిపోర్టర్ ఖాసీం,ప్రజావాయిస్ జిల్లా స్టాఫర్ దుద్దేల సంజయ్, న్యూస్‌లైన్ తెలంగాణ జిల్లా ఇన్‌చార్జి అవుట మధు పాల్గొన్నారు.

## కార్యకర్త వివాహానికి
# కోనేరు శశాంక్ ఆర్థిక చేయూత

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కోటగిరి మండలంలోని వల్బాపూర్ గ్రామ బిజెపి పార్టీ బూత్ అధ్యక్షులు మేకల గంగాధర్ వివాహ ఖర్చులకు బాన్సువాడ నియోజకవర్గ బిజెపి నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్ మండల నాయకుల ద్వారా రూ.5000 ఆర్థిక సహాయం పంపించి కార్యకర్త వివాహానికి చేయూతగా నిలిచారు.ఈ సందర్భంగా మేకల గంగాధర్ కోనేరు శశాంక్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏముల నవీన్,హంసల అశోక్, మేకల గంగాధర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని తాసిల్దార్ కు వినతి



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల పరిధిలోని చిల్వర్ గ్రామ శివారులోని 429 ప్రభుత్వ భూమిలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో తాసిల్దార్ మల్లయ్య కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామ శివారులోని 33 ఎకరాల 16 గుంటల ప్రభుత్వ భూమిలో గత 30 ఏళ్లకు పైగా నిజమైన లబ్ధిదారులు కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్నారని, కాస్తులో లేకున్నా కొందరు అక్రమంగా పహానిలో నకిలీ పత్రాలతో పేరు నమోదు చేసుకున్నారని వీరి వల్ల అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అధికారులు కబ్జాదారుల సమక్షంలో సర్వే చేయించి అర్హులైన వారికి హద్దులు చూపించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జలగళ్ల రవీందర్,లక్ష్మయ్య,మొగులయ్య తదితరులున్నారు.

## ఆరోగ్య తనిఖీ శిబిరంలో వైద్య పరీక్షలు



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల కేంద్రమైన అల్లదుర్గంలోని బుడగ జంగాల కాలనీలో స్కోప్ ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య తనిఖీ శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్ సారిక, కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఈ క్యాంపులో 50 మంది వరకు బిపి,షుగర్ తో పాటు సిబిఎస్ టెస్ట్ లు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సౌమ్య సురేష్ గౌడ్,కార్యదర్శి ప్రభాకర్,ఐసిటిసి అధికారి నర్సింలు ,స్కోప్ ఎన్జీవో అధికారులు కృప కుమార్,భరత్,యాదు,మారుతి, ఏఎన్ఎం హసీనా,జయశీల,తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీపై కంది, మినుము విత్తనాల పంపిణీ

- రైతులందరు సద్వినియోగం చేసుకోవాలి
- ఏవో నిషిత

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** యాసంగి పంటకు రైతులకు సబ్సిడీపై కంది, మినిము విత్తనాలు అందుబాటులో ఉంచా మని రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని పోతంగల్ మండల వ్యవసాయ అధికారి నిషిత పిలుపునిచ్చారు. సోమవారం పోతంగల్ మండలంలోని హెగ్డోలీ రైతు వేదికలో మిషన్ ఫర్ ఆత్మ నిర్భారత ఇన్ పల్సెస్ (ఎంఏఎ న్పి) పథకం కింద రైతులకు సబ్సిడీపై ఇచ్చే కంది,మినుముల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించా రు.ఈ సందర్భంగా ఏవో నిషిత మాట్లాడుతూ..మండల రైతులకు 145 బస్తాల (4 కేజీ) కంది విత్తనాలు 13 బస్తాల (4 కేజీ) మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని. విత్తనాలు కొనుగోలు చేయదలచిన రైతులు తమ పట్టా పాస్ బుక్,ఆధార్ కార్డ్ జిరాక్ లను స్థానిక ఏఈఓ కి ఇచ్చి సబ్సిడీపై విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ శంకర్,రైతులు పాల్గొన్నారు.



# జెడ్పీహెచ్ఎస్ ఎత్తొండ పరిధిలోని గ్రామ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

- **గ్రామీణ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఒక వరం**
- **ప్రిన్సిపల్ అలివేలు**
- **చదువుకున్న పాఠశాలకు అవసరమైన వనరులు సమకూర్చడం ఒక బాధ్యత**
- **సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్**
- **బోధన్ ఆర్టీసీ డీఎంకు కృతజ్ఞతలు తెలియజేసిన ప్రజలు, ప్రజాప్రతినిధులు,అధికారులు**



**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామీణ ప్రాంత విద్యార్థులు సురక్షితంగా స్థానికంగా ఉన్నటువంటి పాఠశాలలకు సకాలంలో చేరుకునేందుకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ఒక వరం అని జడ్పీ హెచ్ఎస్ ఎత్తోండ ప్రిన్సిపల్ అలివేలు అన్నారు. చదువుకున్న పాఠశాలకు అవసరమైన వనరులు సమకూర్చడం పూర్వా విద్యార్థుల బాధ్యత అని ఎత్తొండ గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత పేర్కొన్నారు. సోమవారం కోటగిరి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ఎత్తొండ పాఠశాలలో చదువుకునే చుట్టుపక్కల గ్రామాలైన వల్బా పూర్,దోమలెడ్గీ, యాద్గర్పూర్ విద్యార్థుల రవాణా సౌకర్యం కొరకు బోధన్ డీఎం సహకారంతో ఎత్తొండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ చొరవతో ఉచిత బస్సు రవాణా సౌకర్యా న్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూర్యకాంత్ మాట్లాడుతూ..తాను చేసింది సేవ కాదని బాధ్యతాయుతమైన కర్తవ్యం అని అన్నారు.తాను చదువుకునే రోజుల్లో ఇంట్లో అన్ని పనులు చేసుకొని పాఠశాలకు ఆలస్యంగా వచ్చేవాడినని.అలాంటిది చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులు నడుచుకుంటూ రావడం సాహసమే అని అన్నారు.పుట్టిన ఊరికి, చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయడం ధర్మం అని తెలియజేశారు.ప్రతిరోజు విద్యా ర్థులు నడుచుకుంటూ పక్క గ్రామం నుంచి పాఠశాలకు వెళ్తుండటం చూసి తనకు ఎంతో బాధ కలిగిందని.ఆ కష్టాన్ని తొలగించాలనే సంకల్పంతో బోధన్ డీఎంతో మాట్లాడి వయా వల్బాపూర్,దోమలెడ్గీ ,యాద్గర్పూర్ మీదుగా ఎత్తొండ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా అందుకు బోధన్ ఆర్టీసీ డీఎం సానుకూలంగా స్పందించి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారని అన్నారు.తమ ప్రాంత విద్యార్థులకు ఉచిత బస్సు ఏర్పాటుకు సహ కరించిన బోధన్ ఆర్టీసీ డీఎం కు ఆయా గ్రామాల ప్రజల తరఫున ఆయన ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఉదయ భాస్కర్,విద్యార్థుల తల్లి దండ్రులు, విద్యార్థులు,నాయకులు పాల్గొన్నారు.



# చాల్కి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూమ్, ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్, టాయిలెట్ల ప్రారంభం

- **పెగా సిస్టమ్స్, టీచ్ ఫర్ చేంజ్ ఆధ్వర్యంలో ఆధునిక సౌకర్యాల కల్పన**
- **ఎఐ యుగంలో ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ఉండాలి**
- **టీచ్ ఫర్ చేంజ్ సంస్థ వ్యవస్థాపకురాలు,నటి మంచు లక్ష్మి**


**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాలని, కృత్రిమ మేధస్సు (AI) యుగంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడకూడదని టీచ్ ఫర్ చేంజ్ సంస్థ వ్యవస్థాపకురాలు,నటి మంచు లక్ష్మి పేర్కొన్నారు.సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం చాల్కి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పెగా సిస్టమ్స్, టీచ్ ఫర్ చేంజ్ సంస్థల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన డిజిటల్ క్లాస్‌రూమ్,ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్,ఆధునిక టాయిలెట్లను సోమవారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అనంతరం నిర్వహించిన సమావేశంలో మంచు లక్ష్మి మాట్లాడుతూ..సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే పది ప్రభుత్వ పాఠశాలలను టీచ్ ఫర్ చేంజ్ సంస్థ దత్తత తీసుకుని పెగా సిస్టమ్స్ సంస్థ సిఎస్ఆర్ నిధుల సహకారంతో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యాలు, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణలో వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కూడా నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రపంచం ఇప్పటికే AI వైపు వేగంగా పయనిస్తోందని, అయితే మనం ఇంకా డిజిటల్ క్లాస్‌రూమ్‌ల దశలోనే ఉండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఈ సాంకేతిక అంతరాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, దాతలు ముందుకొచ్చి గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని విద్యాభివృద్ధికి చేయూతనివ్వాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెగా సిస్టమ్స్ సంస్థ ప్రతినిధి డా. ధరణికోట సుయోధన్,టీచ్ ఫర్ చేంజ్ ప్రతినిధులు,ఉపాధ్యాయులు,గ్రామ ప్రజాప్రతినిధులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## గీతంలో ఉత్సాహభరితంగా
# యోగా దినోత్సవం

**ఆనందంగా పాల్గొన్న గీతం ఉన్నతాధికారులు, సిబ్బంది, విద్యార్థులు**






**పటాన్ చెరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఆరోగ్యం, శ్రేయస్సుకు యోగాను ఒక సంపూర్ణ విధానంగా ప్రోత్సహించేందుకు, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని క్రీడా విభాగం సోమవారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహభరితంగా జరుపుకుంది. ప్రాంగణంలోని అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను గాంధీ స్క్వేర్ లో ఒకచోట చేర్చి యోగ సాధన చేయించారు. అన్ని వయస్సుల వారిలో శారీరక శక్తి, మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత,ఆరోగ్యకరమైన దీర్ఘాయువును ప్రోత్సహించడంలో యోగా పాత్రను నొక్కి చెప్పే ఈ ఏడాది విశ్వవ్యాప్త ఇతివృత్తం 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా'కు అనుగుణంగా ఈ వేడుకను నిర్వహించారు.శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగాభ్యాసాల ప్రాముఖ్యత, వాటి ప్రాధాన్యతపై పరిచయంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. దీని తరువాత,భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచించిన కామన్ యోగా ప్రోటోకాల్ కు అనుగుణంగా యోగాసనాలు,కపాలభాతి, ప్రాణాయామం, ధ్యానంతో కూడిన మార్గదర్శక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ యోగ సాధనలో అంతా చురుకుగా పాల్గొని, యోగా యొక్క శాస్త్రీయ ప్రయోజనాలపై విలువైన అవగాహన పొందారు. క్రమం తప్పని యోగా సాధన చురుకైన జీవనశైలికి, ఒత్తిడి నియంత్రణకు, వ్యాధుల నివారణకు, సంపూర్ణ శ్రేయస్సుకు ఎలా దోహదపడుతుందో శిక్షకుడు వివరించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు,రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తో పాటు పలువురు విభాగాధిపతులు హాజరయ్యారు. వీరంతా ఆరోగ్యకరమైన, మరింత సమతుల్యమైన జీవనశైలి కోసం ఈ ప్రాచీన క్రమశిక్షణను స్వీకరించడానికి అందరితో కలిసి సాధన చేశారు. ఈ వేడుకలలో భాగంగా, పాల్గొన్న వారందరికీ టీషర్టులు పంపిణీ చేశారు. హాజరైన వారందరిలో ఐక్యత, శ్రేయస్సు, సామూహిక స్ఫూర్తిని పెంపొందిస్తూ, సామూహిక ఫోటో సెషన్ తో పాటు, రుచికరమైన అల్పాహారంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# రూ.5 లక్షల నిధులతో శేఖపూర్ గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభం





**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని శేఖపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మొహమ్మద్ చేష్మొద్దీన్ ఆహ్వానం మేరకు జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, బిఅర్ఎస్ నాయకులు మిథున్ రాజ్ తో కలిసి ఐదు లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. రూ.5 లక్షల ఎన్.ఆర్.ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు భూమిపూజా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..గ్రామంలోని వార్డుల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్న నిధులతో ప్రాధాన్య క్రమంలో పనులు చేపడుతున్నామని, సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని,గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయింపుకు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీమతి భాగ్యలక్ష్మి, సర్పంచులు మొహమ్మద్ చేష్మొద్దీన్ శేఖపూర్,మోహన్ రాథోడ్ శేఖపూర్ తాండ,మంచేందర్ హోతి బి.అరుణ్ కుమార్,భీమ్ రావు రాథోడ్, మాజీ సర్పంచూలు చిన్నరెడ్డి, అరుణ్ కుమార్,నాయకులు గడ్డమిది విజేందర్ రెడ్డి,ఉద్యమకారులు సాదిక్ అలీ, వార్డు సభ్యులు మొహమ్మద్ జాహెద్, మొహమ్మద్ జాహిరుద్దీన్, మరియం సైఫ్,గౌటటి శేఖర్,గుల్బర్గా వాలే గౌస్, షకీర్ ఒస్తద్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను కలిసిన పుల్కాల్ గ్రామ రైతులు

**పుల్కాల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సోమవారం నాడు జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ను కలిసి వినతిపత్రం అందజేసిన పుల్కాల్ గ్రామ రైతులు..పాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్ ) చైర్మన్ అనంతరావు కులకర్ణి,సీఈఓ నాగయ్య , ప్రైవేటు అటెండర్లు డీసీసీబీ లో పనిచేసే ఇసోజీపేట అనిల్,పిఏసిఎస్ లో పనిచేస్తున్న ఇసోజీపేట భాస్కర్ భూముల ఖాతాల రహస్యాన్ని అధికార దుర్వినియోగానికి పాల్పడుతు, ఎరువుల బస్తాల అక్రమ తరలింపు మరియు అవినీతిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.మేము పుల్కల్ గ్రామం పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యులము మరియు స్థానిక రైతులము. మా సొసైటీలో గత కొంతకాలంగా జరుగుతున్న ఒక తీవ్రమైన అక్రమాన్ని మీ దృష్టికి తీసుకురావడానికి విన్నవిస్తున్నాము. మా సహకార సంఘం చైర్మన్ అనంతరావు కులకర్ణి గారు, అక్కడ పనిచేస్తున్న, అటెండర్ (అటెండర్ ) సహాయంతో, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మరియు రైతులకు కేటాయించిన సబ్సిడీ ఎరువుల బస్తాలను ఎవరు లేని సమయంలో అక్రమ మార్గాల్లో సొసైటీ నుండి తరలించారు. సొసైటీ కి వచ్చిన 100 డాప్ బ్యాగులను, సీఈఓ నాగయ్య, అటెండర్ ఇసోజీపేట భాస్కర్ కలసి 35 బస్తాలను తీసుకున్నారు. ఈ అవినీతికి పాల్పడిన చైర్మన్ మరియు అతనికి సహకరించిన సీఈఓ అటెండర్లపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తూసుకోవాలి, అలాగే రైతులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ను రైతులు కోరారు.




Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com